# వ్యాస కౌముది



## 'కళ్యాణి కథ' తెలుగు లోగిళ్ళలో నిత్యం తారసిల్లే ఒక కన్నీటి వ్యథ!

(రంగనాయకమ్మ గారి కల్యాణి కథపై చిరు పరిచయం)

### వి.విజయకుమార్

'కళ్ళు తెరిచిన సీత' తర్వాత రంగనాయకమ్మ గారు రాసిన 'కల్యాణి కథ' సైతం కాలక్షేపానికి చదివే కథ కాదు. ఇంచుమించుగా ఒక జీవితం. ఒక జీవితంలో ప్రతిఫలించే వేలాది జీవితాల సమాహారం. ఇందులో శంకర్రావులు ఎక్కడో లేరు. నిజానికి మన ఇరుగున, మన పొరుగున, మన ఇంట్లో, మన వంట్లో కూడా ఉన్నారు. మన సమాజం శంకర్రావుల బ్రాండ్ ఫ్యాక్టరీ. ఆ కొలతల చొక్కాలు అటూ ఇటుగా మెజార్టీ కి నప్పుతాయ్! అందుకే శంకర్రావు కున్న వంకర బుద్ధులన్నీ మనలో చాలామందికి వంటబట్టి ఉండడం ఒక తప్పనిసరి అగత్యం! చుట్టాలింటికొచ్చిన నారాయణ ఎంత నేర్పాడు మనకి? చకా చకా నీళ్లు తోడుతూ, ఇంట్లో సాయపడుతూ! మూడొందల పైచిలుకు పేజీల ఈ నవల్లో శంకర్రావులో మనం ఎంత శాతం ఉన్నామో బేరీజు వేసుకుంటూ మనలోని వంకర్లని తొలిగించుకోవడానికి ఈ నవల ఉపయోగపడే ఉద్దేశ్యంతోనే ఈ నవల కోసం అంత సమయం వెచ్చించి ఉండాలి రంగాజీ అనిపిస్తుంది. జ్యోతి వ్యంగంగా పేరు పెట్టి పిలిచే 'సెంకట్రావ్' (శంకర్రావు+వెంకట్రావు) కుబుసాలు విడిచి, 'సత్యం' గా మారే అవకాశాలు కల్పించే పుస్తకాలు ఎక్కడ అనే ప్రశ్నకు సమాధానంగా రాశారు ఈ పుస్తకం అనిపిస్తుంది! దుర్గలూ,రాధలూ,లావణ్యలు ఎక్కడో లేరు! మన అప్పా చెల్లెళ్ళ లోనే వున్నారని నవల చదువుతున్నంత సేపూ అనిపిస్తూనే ఉంటుంది.

అందుకే శంకర్రావు అమ్మా, అప్పా చెల్లెళ్ళు మాట్లాడేటప్పుడు మనం 'తెల్లబోవడం', 'నిర్ఘాంతపోవడం', 'స్పృహతప్పి పోవడం' ఉండదు! జుగుప్స కలిగించే వంటి మట్టితో నలుగు పిండి కలిపి చేసిన సృష్టి లయకారుడి భార్య, బొమ్మ చేసి, ప్రాణం పోసి, స్నానాల దొడ్డి ముందు కాపలా పెట్టి, మూడు కళ్ళతో కూడా చూడలేని వాడి చేతిలో తల తెగ్గొట్టుకొని, ఆ తల అక్కడ వున్నా (ఎంతో తెలివిగా?) ఏనుగు తల (ఆర్గన్ ట్రాన్స్ ప్లాంటేషన్) అతికించిన మహత్తర

కథను మన అమ్మలు ఇంట్లో, పంతులమ్మలు బళ్ళో వింటూనే పెరిగాం! సింహం మీద జుట్టు విరబోసుకున్న జానెడు నాలిక దయ్యపు భీకారాకృతి ఏదో ఇంట్లో గోడమీద పటంగా చూడటం ఆనవాయితీనే! ఇవేవీ మనకి కొత్తగావు!!! బహుశా రంగాజీకి గత ఏభై అరవయ్యేళ్ళ తన జీవన శైలికి పూర్తిగా పరాయివి!! అయితేనేం, ఈగలు విదిలించి తినే బెల్లం ముక్కప్రసాదం గురించి అంత వైనంగా ఎలా చెప్పారబ్బా అనిపిస్తుంది! ఓ వైపు పొట్ట చెక్కలయ్యే నవ్వు ఆపుకుంటూ కూడా!

'ఫాల్టీ రిలేషన్ల' బై ప్రోడక్ట్ శంకర్రావు తనలో లేని 'మగ' కంటెంట్ విషయంలో పెద్దగా ఇన్ఫీరియర్ గా ఫీలవడు, ఎందుకంటే, అంతకుమించిన మగతనపు అంశాల్ని సమాజం సుష్టుగా అప్పజెప్పింది. అందుకే కల్యాణితో తన ప్రవర్తన అంతా 'మగాడి' గానే! కారణం కట్నం, నగలూ తేని, తేలేని పిల్లకి ఏ అత్తయినా, ఆ ఇంట్లో ఆడ బిడ్డలకు లోకువే! యీ మగాడికి ఇరువైపులా కాపుకాసే అమ్మా, ఆడబిడ్డలు రక్షకభటులు! ఇంట్లో హాల్లో టీవీలో 'కార్తీకదీపం' వెలుగుతూవుంటే, పడమటింట్లో పెద్ద పటాల ముందు నూనె దీపాలు ఆరిపోకుండా చూస్తూ, బెల్లం ముక్క ప్రసాదం మీద ఈగలు తోలుతూ, కుర్చీ సుఖం అనుభవించే అత్తమ్మకూ, ఆడబిడ్డలకూ సేవ చేసే మహద్భాగ్యం కల్యాణికి కలిగించిన పురుషపుంగవుడిగా అతని స్థానం పదిలం. వాడికేం వాడు మగాడు!, వాడు మగ మహారాజు! ఒకసారి మెళ్ళో తాడు ముడేశాక వాడు హీరో!

ఎడమవైపు నిలబడే వామాచారమూ, నేల మీద కూర్చునే గణాచారమూ, అన్నం తిన్న పళ్లెం లో పుక్కిలించే పాత రాతి యుగానికి ముందలి భ్రష్టాచారం శంకర్రావు పాటించకుండా ఉండలేని అశక్తతని కల్యాణి తెలుసుకోలేక పోవడం విచిత్ర మేమీకాదు. కల్యాణి శంకర్రావు తో కలిసి బతకడానికి 'లైంగిక పరమైన' చర్య ని చాలా తేలిగ్గా తీసేసి, బతకాలనుకున్నా, నిజమైన 'మగతనపు' ఛాయలు లేకున్నా, ఒక 'మొగ దిక్కు' గా సమాజం కట్టబెట్టిన అధికారంతో చులాగ్గా బతికేయగలగడం ఈజీ గానే భావించాడు శంకర్రావు. ఫోన్లో తియ్యగా మాట్లాడే శంకర్రావు తాడు మెళ్ళో తగిలించాక మాట్లాడే శంకర్రావుకు తేడా తరతరాలుగా మగాడి వారసత్వ సంపదగా వొచ్చే సంప్రదాయం అన్నది కల్యాణికి ఎందుకు తెలియదో అర్థం కాదు!

సమాజ చట్రంలో చూస్తే అమ్మలూ, ఆడబిడ్డలూ, తెల్లగా పుట్టి, పదో తరగతి తప్పి, జాతకాలు నమ్మి ఇంట్లో మహాలక్ష్మి లా వెలిగే లావణ్యలూ, ఎవరిపాత్రలో వాళ్ళు వొదిగిపోయారు. భిన్నంగా కనబడేది మన కళ్ళకి 'కల్యాణి' ఒక్కతే! ఎందుకంటే 'పుంసత్వం' కంటే స్నేహం గొప్పది అని నమ్మింది కల్యాణి. నాన్న కట్నం ఇవ్వడూ, కానుకలూ తేడు అని

చెప్పింది, నడవగలిగే అత్తని చేత్తో పట్టుకొని బాత్రూం వైపుకి తీసు కుపోవడం అవసరమా అంది గడుసుగా, కుర్చీ సుఖంతో ఉన్న ఆడబిడ్డ పక్కన కింద కూచోడానికి తంటాలు పడింది. శంకర్రావు గోడలమీద పటాలమీద పాకి, అగరొత్తులు వెలిగించి, అక్కడున్న బెల్లం ముక్కల మీద ఈగల్ని చేతుల్తో అదిలించి, ప్రసాదం పంచుతుంటే,హారతి అందిస్తే, కళ్యాణి నాకు నచ్చదని చెప్పడం సామాజిక ద్రోహం కాదా? కట్నం పాయే, కానుకలూ లేవాయే, పోనీ తెల్ల తోలా? అదీ కాదాయే! అణిగి మణిగి ఉండటం వచ్చా అంటే అదీ రాదాయే! మత్తుకొట్టి, శవాన్ని చేసి, తన మగతనాన్ని శోభనం రోజే పరీక్షించుకున్న మొగాడి బిడ్డని ద్వేషించడానికి బదులు సూర్య గా గుండెల మీద మోసింది తప్ప ఆ అసహ్యకర కలయిక ద్వారా పుట్టుకొచ్చిన పిండాన్ని కడతేర్చి యింకో పెళ్లి అనుకోలేని ఈ సమాజ సభ్యురాలు కాని లోకం తెలీని పిల్ల. దిక్కులేని జ్యోతి అనే ఆడపిల్ల అనే 'కుంపటి' ని కన్నబిడ్డలా ఇంట్లో పెట్టుకొని సాకిన యీ కళ్యాణి అప్పుడప్పుడూ విస్తుపోయినట్టు, మంచీ, చెడూ గుణాలు ఉన్నవారు పుట్టుకతోనే వచ్చేస్తే 'మారడం' అనే మాట ఒక సదసత్సంశయం కాదా?

నవలంటే హాయిగా చదువుకు వెళ్లే షాడో టైపు, సూడో సమాజ పాత్రలకు భిన్నంగా, వెంకట్రావుల చెర నుంచి జానకీల విముక్తి కోసం నాలుగు దశాబ్దాల క్రితం రాసిన పదకొండు వందల పేజీల బృహన్నవల తెలుగు నవలాలోకం లో ఒక గొప్ప కదలికకు కారకమైంది. నేటి 'కల్యాణి కథ' రాసేప్పటికి రంగాజీ వయస్సు ఎనభైల పైమాటే! ఒక నవల రాయడానికి దన్నుగా కొన్ని సజీవ పాత్రల్ని ఎన్నుకున్నా, సమాజ చిత్రాన్ని ప్రతిభావంతంగా చిత్రించిన తీరు ఏ మాత్రం మారలేదు. గిలిగింతలు పెట్టే హాస్యం, చాచి మోహన కొట్టే విసుర్లూ, నవల పొడవునా అంతర్లీనంగా చిత్రించే వుంటాయ్! జుట్టు పిల్లాడి నెత్తిమీద పరిచి పెట్టినట్టు ఉండడాలూ, నైట్ బురఖాలూ, ఆస్పత్రికి వెళ్ళాల్సివచ్చినా లిప్స్టిక్ లేకుండా వెళ్లలేక పోవడాలూ, గోడలనిండా దొంగల్ని పట్టే యంత్రాలూ, ఏడు రోజులు చేస్తే ఏడు పుణ్యాలు రావా అనడాలూ, పెళ్ళాన్ని కూచో బెట్టడానికి మంచం పక్క నేల చూపించడాలూ, సన్న సన్నటి గొలుసులూ, శోభనం స్టోర్ గదిలో ఎలుక దూకడాలూ, ఇంకా, శోభనం గది 'వాదాలగది' లా మారడం గురించీ, గుత్తివంకాయకూరలో వంకాయల్ని పిసికి,పిసికి కలిపినప్పుడు కల్యాణి కి స్పృహ తప్పే ప్రమాదాల గురించీ, ఆదివారాలన్నీ నల్ల ఆదివారాలుగా మారడాల గురించీ..యింకా ఎన్నో కడుపుబ్బా నవ్వించే రసవత్తరమైన సన్నివేశాలు వుంటాయ్. శంకర్రావు కోపాలన్నీ మనకి వినోదాలుగా ఉంటూనే మనల్ని ఇలా చేసేవు సుమా అని హెచ్చరిస్తూనే వుంటాయ్!

"స్వాతి" కి ఇవ్వడంపై ఎందుకు బాధపడ్డారో చెప్పారు రంగాజీ చివర్లో! నిజమే దినపత్రికల్లో ఒకటి రెండు తప్ప స్త్రీ శరీరాలూ, మాంసాలూ వ్యాపారంలో పెట్టని పత్రికలు లేకపోవడం ఘోరమే! ఇది నిజానికి చదవాల్సిన వారు

కల్యాణి లే కాదు సెంకట్రావ్ లు మాత్రమే కాదు, అమ్మ తరాలు వారు కూడా మరీ ముఖ్యంగా ఆడబిడ్డల డిసిగ్నేషన్ మోసేవారు కూడా! విదేశాలలో డాక్టర్, ఇంజనీరింగు చదువులున్న కూతుళ్లకు, ముగ్గులు నేర్పించి, గొబ్బెమ్మలు పిసికించి, గోమూత్రం గొప్ప దనాలు చెప్పి, బతకమ్మలు ఆడించి, ఇంటికి వీడియోలు పంచి, విదేశాల్లో సైతం భారతీయ పిడకలు ఎంత ధారాళంగా పొగలు చిమ్ముతూ నింగికి ఎగిరిపోతున్న వైనాల నేపథ్యంలో సంప్రదాయ తెరలు చించి తొలగించుకొని మరీ ఇది చదవాల్సిన అవసరం వుంది నేటి తరానికి.

****

COMMENTS